తెలంగాణ జాతిపితకు జన్మదిన కానుక

మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో వృక్షార్చన పోస్టర్‌ను విడుదల చేస్తున్న పార్టీ సీనియర్ నాయకులు విఠల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ప్రమోదిని

తాండూరు, ఫిబ్రవరి 16 : తెలంగాణ జాతిపిత, హరిత తెలంగాణ స్వాప్నికుడు, రైతు బంధు, రైతు పక్షపాతి, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన సందర్భంగా తలపెట్టిన వృక్షార్చనతో తెలంగాణ భూతల్లికి మరోసారి ఆకుపచ్చని చీర చుట్టనున్నారు. తెలంగాణను ఆకుపచ్చ తెలంగాణగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దే. నేడు కేసీఆర్ జన్మదిన సందర్భంగా ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కేసీఆర్ సంకల్పానికి మద్దతుగా చంద్రునికో నూలు పోగులాగా తలపెట్టిన వృక్షార్చనలో భాగంగా ఆదివారం తాండూరు పట్టణ కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు విఠల్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ప్రమోదిని వృక్షార్చన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించే భాధ్యత తీసుకోవడమే కేసీఆర్‌కు మనం ఇచ్చే పుట్టిన రోజు కానుక అని అన్నారు. రాష్ట్రం, దేశం పచ్చబడాలనే సంకల్పంతో సంతోష్ కుమార్ తలపెట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమంలో భాగంగా తలపెట్టిన వృక్షార్చనలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మనలో ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటి ఆ మొక్కలతో సెల్ఫీ దిగి 9177916838 నబర్‌కు వాట్సాప్ చేయాలన్నారు.

ఎంఈవో రాములుకు సన్మానం

బషీరాబాద్ :ఎంఈవో రాములును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బషీరాబాద్, ఫిబ్రవరి 16 : ఎంఈవోగా రాములు ఉద్యోగ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు ఆదివారం ఎంఈవోను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెంకట్రాంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రవికాంత్, అయూబ్, నర్సింహులు, అల్లావుద్దీన్, భిక్షపతి, ముస్తఫా, చంద్రశేఖర్‌రెడ్డి, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంఈవోగా రమేశ్

యాలాల : యాలాల నూతన ఎంఈవోగా రమేశ్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆర్‌బీవోఎల్ సీఈవో, సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి ఎంఈవోకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములు, లక్ష్మయ్య పాల్గొన్నారు.



యాలాల : ఎంఈవో రమేశ్‌తో ఆర్‌బీవోఎల్ సీఈవో, సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి

బడి ఒడిలో.. జ్ఞాపకాల జడి

వికారాబాద్ : ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

వికారాబాద్, ఫిబ్రవరి 16 : వారంతా పూర్వ విద్యార్థులు. 20 ఏండ్ల క్రితం పదో తరగతి పూర్తి చేశారు. ఆ పై చదువుల కోసం వేర్వేరు ప్రాంతాలకు వెళ్లారు. తమ పాఠశాల జ్ఞాపకాలను మాత్రం మర్చిపోలేదు. మోమిన్‌పేట మండల పరిధిలోని టేకులపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2005–06 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆ పరిమళాలను మరోసారి ఆస్వాదించాలనే తపనతో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఒక్కచోటకు చేరి నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అప్పుడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. మొత్తం 56 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పటి విద్యార్థి, నేటి ఎంఈవో మల్లేశం మాట్లాడుతూ.. పతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయన్నారు. వంటావార్పుతో సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బ్రహ్మం చారి, శ్రీనివాస్ జోషి, నీలారాణి, సంజీవరావు, ప్రకాశం, రత్నం, వెంకటయ్య, పూర్వ విద్యార్థులు రమేశ్, ప్రవీణ్ కుమార్, రమేశ్, పల్లె సురేందర్ రెడ్డి, శ్రీశైలం, పరశురాం గౌడ్, శ్రీనివాస్, రసీద్, కుమార్, మధుకర్, ఇనుస్, రాఘవాచారి, ప్రభు, సంతు, పవన్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ముజాహిద్‌పూర్‌లో..

కులకచర్ల : మండల పరిధిలోని ముజాహిద్‌పూర్‌లో ఉన్న జడ్పీ పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీ సమ్మేళనం నిర్వహించారు. 2001–02 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదువుకున్న సమయంలో చేసిన చిలిపి పనులు, గురువులతో వ్యవహరించిన తీరును నెమరు వేసుకున్నారు. 22 ఏండ్ల తర్వాత కలిసిన మిత్రులు గత మధుర జ్ఞాపకాలను ప్రత్యక్షంగా పంచుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులకచర్ల : ముజాహిద్‌పూర్‌లో..

బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి

పెద్దేముల్, ఫిబ్రవరి 16 : అదుపు తప్పి బైక్‌పై నుంచి కింద పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం పెద్దేముల్ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. తాండూరు మండల పరిధిలోని కోటబాస్పల్లి గ్రామానికి చెందిన ముదంగుల బాలకృష్ణ (28) హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సొంతూరుకు బైక్‌పై వస్తుండగా పెద్దేముల్ శివారులో అదుపు తప్పి కిందపడ్డాడు. గమనించిన స్థానికులు యువకుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి వచ్చి చూడగా అప్పటికే యువకుడు మృతి చెందాడు. మృతుడి తండ్రి బాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సిబ్బంది లేక ఇబ్బంది

- మండల కార్యాలయాల్లో పలు పోస్టులు ఖాళీ
- అధికారులు లేక ఖాళీ కుర్చీలే దర్శనం

పూడూరు, ఫిబ్రవరి 16 : మండల పరిధిలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సరైన సిబ్బంది లేక ఖాళీ పోస్టులతో కుర్చీలు దర్శనమిస్తున్నాయి. మండల పరిధిలోని 31 గ్రామ పంచాయతీలతో పాటు పలు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. పని దినాల్లో ప్రతి రోజు గ్రామాల నుంచి మండల ప్రజా పరిషత్ (ఎంపీడీవో), తహసీల్దార్, ఎంఈవో కార్యాలయాలకు ఆయా పనులపై ప్రజలు వస్తారు. గత నెలలో డిప్యూటీ తహసీల్దార్ కిశోర్‌పై ఓ భూ రిజిస్ట్రేషన్ వివాదం చోటు చేసుకోవడంతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేయడంతో ఆ పోస్టు ఖాళీగానే ఉంది. మండల పరిధిలో అధిక గ్రామాలు ఉండడంతో రెవెన్యూ కార్యాలయంలో ఇద్దరు ఆర్ఐలు ఉన్నారు. ఒక ఆర్ఐ శ్రావ్య 16 గ్రామాలు, మరో ఆర్ఔ సుధ 15 పంచాయతీల రెవెన్యూ రికార్డులు చూసేవారు. ఆయా గ్రామాల నుంచి రెవెన్యూ సమస్యలపై వచ్చే వారికి సైతం సులువుగా పనులు జరిగేవి. గత నెలలో ఆర్ఐ సుధను బదిలీ చేయగా ఆమె స్థానంలో ఎవరినీ నియమించక పోవడంతో ఖాళీగానే ఉంది. ఆర్ఐ శ్రావ్య ఒక్కరే ఉండడంతో అన్ని గ్రామాల రికార్డుల పరిశీలించడంలో పనుల్లో జాప్యం జరుగుతున్నది. సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రవిని ఇక్కడి నుంచి చౌడాపూర్ మండలానికి డిప్యుటేషన్‌పై ఉన్నతాధికారులు పంపించారు. కంప్యూటర్ ఆపరేటర్ రహీంను ఇక్కడి నుంచి బదిలీ చేశారు. వారి స్థానాలో ఎవరినీ నియమించలేదు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోనూ గత కొంతకాలంగా పంచాయతీ రాజ్ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఏఈల పోస్టులు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో చేసే పనులకు రికార్డులు చేసేందుకు ఇన్‌చార్జీల వద్దకు రోజుల తరబడి తిరగాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంఈవో లేకపోవడంతో ఇన్‌చార్జీలతోనే కాలం ఎల్లదీస్తున్నారు. మండల కార్యాలయాల్లో సరిపడా సిబ్బంది లేక పోవడంతో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వారికే పనిభారం పెరిగింది. చిన్న చిన్న పనుల కోసం ఈ కార్యాలయాలకు వస్తే సరైన సిబ్బంది లేక పోవడంతో రోజుల తరబడి తిరగాల్సి వస్తుందని పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనాజిల్లా ఉన్నతాధికారులు మండల కార్యాలయాల్లో వెంటనే సిబ్బందిని భర్తీ చేసి పనులో జాప్యం లేకుండా చూడాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పూడూరు తహసీల్దార్ కార్యాలయం

తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ లేక దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

సిబ్బందిని నియమించాలి

మండల కేంద్రంలోని రెవెన్యూ, ఎంపీడీవో, విద్యాశాఖలోని అధికారులు, సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలి. 31 గ్రామ పంచాయతీల నుంచి క్యాస్ట్, ఇన్‌కం తదితర చిన్న చిన్న సర్టిఫికెట్ల కోసం ప్రతి నిత్యం వస్తుంటారు. డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ ,కంప్యూటర్ ఆపరేటర్లు లేక పోవడంతో ఒకే రోజులో అయ్యే పనులు జరగడం లేదు. ఆర్ఐ శ్రావ్య ఒక్కరే ఉండడంతో రెవెన్యూ రికార్డులతో పాటు విద్యార్థుల సర్టిఫికెట్లు చూసి సమయానికి ఇవ్వలేక పోతున్నారు. ఇప్పటికైనాజిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే అన్ని శాఖలోని సిబ్బందిని భర్తీచేయాలి.

-ఎ.వెంకటయ్య, స.హ.చట్టం మండల కన్వీనర్, పూడూరు మండలం

బదిలీ, డిప్యుటేషన్‌పై వెళ్లడంతో..

కార్యాలయంలో పలువురు సిబ్బంది బదిలీ, డిప్యుటేషన్‌పై వెళ్లడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డిప్యూటీ తహసీల్దార్ గత నెలలో సస్పెండ్ కావడంతో పాటు పలువురు బదిలీలపై వెళ్లారు. దీంతో గ్రామాల్లో పంచనామలు చేయాలన్నా.. విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలన్నా కొంత సమయం పడుతుంది. ప్రజలు కార్యాలయ సిబ్బందితో సహకరించి పనులు చేయించుకోవాలి. ప్రస్తుతం కొంత సిబ్బంది లేక జాప్యం జరిగినా అందరి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నా. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా నేరుగా నన్ను కలవ వచ్చు.

-భరత్ కుమార్, తహసీల్దార్, పూడూరు మండలం

క్రిప్టో చీటింగ్

- ట్రేడింగ్ పేరుతో భారీ మోసాలు
- పది రోజుల్లో కోటి రూపాయలకు పైగా లూటీ
- విద్యావంతులే బాధితులు
- ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనలు క్లిక్ చేసి బాధితులవుతున్నవైనం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్‌తో మంచి లాభాలొస్తాయంటూ నమ్మిస్తూ సైబర్‌నేరగాళ్లు అందిన కాడికి దోచేస్తున్నారు. బిట్ కాయిన్ ధర లక్ష డాలర్లకు చేరువవుతుండగా, ఇతర క్రిప్టో కరెన్సీలలో రోజు వారిగా హెచ్చుతగ్గులుండడంతో చాలా మంది విద్యావంతులు స్టాక్స్ ఎక్స్ఛేంజ్ కంటే క్రిప్టోలో పెట్టుబడులు పెడితే లాభాలు ఆర్జించవచ్చనే ఆలోచనలో ఉంటున్నారు. అలాంటి వారినే లక్ష్యంగా చేసుకుంటూ సైబర్‌నేరగాళ్లు లక్షల రూపాయలు దోచేస్తున్నారు. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే రాచకొండ కమిషనరేట్ పరిధిలో రూ. కోటికిపైగా బాధితులు మోసపోయారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, వ్యాపారులు ఇందులో బాధితులుగా మిగులుతున్నారు. క్రిప్టోలో ఎక్కువగా యూఎస్‌డీటీపై పెట్టుబడి పెట్టండంటూ సైబర్‌నేరగాళ్లు సూచనలు చేస్తున్నారు. మోసపోతున్న వాళ్లు చాల మంది ఇన్‌స్టాగ్రామ్స్ రిల్స్‌లలో వచ్చే ట్రేడింగ్ ప్రకటనలతో ఈజీగా బుట్టలో పడేస్తున్నారు. సోషల్‌మీడియాలో సైబర్‌నేరగాళ్లు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను ఉపయోగిస్తూ ప్రముఖులు ట్రేడింగ్ చేసి భారీ లాభాలు సంపాదించారంటూ వారి డమ్మీ వీడియోలు తయారు చేసి ప్రకటనలు ఇస్తున్నారు. ఇలాంటి వాటికి కొందరు ప్రేరేపితమవుతుండగా, మరికొందరు ఇతర ప్రకటనలతో ట్రేడింగ్ ట్రాప్‌లో పడి భారీ మోసాలు చవిచూస్తున్నారు. సైబర్‌నేరగాళ్లు భారతదేశంలో మోసం ద్వారా బ్యాంకు ఖాతాలలో డిపాజిట్ చేయించే రూపాయాలను, యూఎస్‌డీటీ క్రిప్టోలోకి మార్చి విదేశాలకు పంపిస్తున్న ఘటనలు కూడా ఉన్నాయి. ఇలా సైబర్‌నేరగాళ్లు క్రిప్టోలో ట్రేడింగ్ అంటూ అమాయకులకు వల వేస్తూ బాధితులను భిన్న రకాలుగా మోసం చేస్తున్నారు. కొన్ని సందర్భాలలో బాధితులు సైతం నిందితులుగా మారే అవకాశాలున్నాయి.

ఇటీవల నమోదైన కొన్ని కేసులు

- బడంగ్‌పేట్‌కు చెందిన ఒక యువతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ట్రేడింగ్‌కు సంబంధించిన ప్రకటన చూసింది. ఆ ప్రకటనను క్లిక్ చేయడంతోనే ఒక వాట్సాప్ గ్రూప్‌లో చేరాలని సూచించడంతో ఆమె ఆ గ్రూప్‌లో చేరింది. అది ప్రత్యేకంగా క్రిప్టో ట్రేడింగ్ గ్రూప్ కావడంతో పాటు కిశోర్ లింగంపల్లి అనే పేరుతో దానిని నిర్వహిస్తున్నారు. మొదట రూ. 3 వేలతో ప్రారంభించి, కొన్ని లాభాలు చూపించారు. దీంతో ఆమెకు పూర్తిగా నమ్మకం వచ్చిన తరువాత పెట్టుబడిని నెమ్మదిగా పెంచుతూ, మీ డబ్బుకు నాది గ్యారంటీ అంటూ గ్రూప్ అడ్మిన్ కిశోర్ పేరుతో ఉన్న వ్యక్తి చెబుతూ వచ్చాడు. నేరగాళ్లు సూచించిన యాప్ నుంచి తన లాభాలు తీసుకోవడానికి బాధితురాలు ప్రయత్నించింది. అయితే ఇప్పుడే డ్రా చేసుకోవద్దని ఇంకా కొన్ని రోజులు ఇన్వెస్ట్ చేస్తే మంచి లాభాలొస్తాయంటూ నమ్మిస్తూ దఫ దఫాలుగా లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టించారు. ఇలా రూ. 46.97 లక్షల వరకు బాధితురాలు క్రిప్టో ట్రేడింగ్ కోసం పెట్టుబడి పెట్టి మోసపోయింది.
- ప్రైవేట్ ఉద్యోగం చేసే ఎల్బీనగర్‌కు చెందిన యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో దాన్ యాప్ అండ్ సాట్ స్పోర్ట్స్ క్రిప్టో ట్రేడింగ్ కంపెనీ స్టాక్ అనాలసిస్, క్రిప్టో ట్రేడింగ్ సర్వీస్ చేస్తోందంటూ ఒక ప్రకటన చూసి క్లిక్ చేశాడు.
- ఆ తరువాత వాట్సాప్ గ్రూప్‌లో లింక్ పంపి అందులో బాధితుడి నెంబర్‌ను యాడ్ చేశారు. ఆ తరువాత యూఎస్‌డీటీ క్రిప్టో ట్రేడింగ్‌లో రూ. 20 శాతం పక్కాగా లాభాలొస్తాయంటూ నమ్మిస్తూ దఫ దఫాలుగా రూ. 21.86 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు.
- సరూర్‌నగర్ ప్రాంతంలో నివాసముండే ఒక వ్యాపారికి ఇన్‌స్టాగ్రామ్‌లో ధాన్ యాప్ అండ్ సాట్ స్పోర్ట్స్ క్రిప్టో ట్రేడింగ్ కంపెనీ స్టాక్ అనాలసిస్, క్రిప్టో ట్రేడింగ్ సర్వీస్ చేస్తోందంటూ ఒక ప్రకటన చూసి క్లిక్ చేశాడు. కొద్దిసేపటి తరువాత విక్కీ అనే పేరుతో ఒక వ్యక్తి వాట్సాఫ్ కాల్ చేశాడు. మా సర్వీస్‌లలో యూఎస్‌డీటీ క్రిప్టో రూ. 89కి అందిస్తాం, మీరు దానిపై పెట్టుబడి పెట్టండి తక్కువలో తక్కువ 20 శాతం మీకు లాభాలు వచ్చే విధంగా ప్లాన్ చేద్దామంటూ నమ్మించారు. వాళ్లతో మాట్లాడిన బాధితుడు వారి మాటలు నమ్మేశాడు, దఫ దఫాలుగా రూ. 45,43,998 పెట్టుబడి పెట్టాడు. ఇలా మొదట కొన్ని లాభాలు చూపించి, ఆ తరువాతా భారీగా పెట్టుబడి పెట్టించారు.

మీ ఆవిడని నాకిచ్చేయ్

- ప్రియురాలి భర్తతో గొడవపడ్డ ప్రియుడు
- నిరాకరించిన ప్రియురాలి భర్త
- పెట్రోల్ పోసుకుని ప్రియురాలి ఇంటిముందు నిప్పంటించుకున్న ప్రియుడు
- తీవ్రంగా కాలిన గాయాలతో చికిత్స పొందుతూ దవాఖానాలో మృతి
- యాదగిరినగర్ లో చోటుచేసుకున్న ఘటన

వెంగళరావునగర్, ఫిబ్రవరి 16: ‘ నీ భార్యని నాతో పంపించేయ్..ఆవిడ నాక్కావాలి. ఆవిడని గుండెల్లో పెట్టుకుని చూసుకుంటా. ఎన్నాళ్ళని మీ ఇంట్లోనే ఉండిపోను?..మీ ఆవిడని నాకు ఇచ్చేస్తే హాయిగా మా జీవితం మేము బతుకుతాం’ ఆవిడ భర్తతో తెగేసి చెప్పాడో ప్రియుడు. ‘నీకేమైనా మతిగాని పోయిందా..నా పెళ్ళాన్ని ఇచ్చేయమని నన్నే అడుగుతావా’ అంటూ ప్రియురాలి భర్త ప్రశ్నిస్తూ గొడవ పడ్డారు. ‘భార్యా పిల్లల నుంచి దొరకని ప్రేమ, సంతోషం మీ ఆవిడతో లభిస్తుంది. ఆమెని దూరం చేస్తే తట్టుకోలేను’ అని చెప్పాడా ప్రియుడు. చివరకు ఇక ఆవిడ తనకు దక్కదేమోనన్న ఆవేదనతో ఆ ప్రియుడు వ్యథ చెంది ప్రియురాలి ఇంటి ఎదుట ఐదు లీటర్ల పెట్రోల్ శరీరం పై పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని యాదగిరినగర్ లో ఈ ఘటన చోటుచేసుకుంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ పట్నం జిల్లా ఆనందపురానికి చెందిన 34 ఏండ్ల వయసున్న దంపతులు సినిమాలపై మక్కువతో నాలుగేళ్ళ క్రితం నగరానికి వచ్చారు. జూనియర్ ఆర్టిస్టులుగా పనిచేస్తూ యాదగిరినగర్ లో నివాసం ఉంటున్నారు. మహిళ సమీప గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ సూర్యనారాయణ(43) ఆరేళ్ళ క్రితం వీరికి పరిచయమయ్యాడు. ఐదు రోజుల క్రితం ఆయన ఏకంగా సదరు మహిళ ఇంటికే సూర్యనారాయణ వచ్చాడు. వాళ్ళింట్లోనే ఉంటున్నాడు. తన భార్య, కొడుకు, కూతురు తనని పట్టించుకోవడం లేదని వారితో చెప్పి బాధపడేవాడు. కూతురికి పెళ్లి చేసి పంపానని.. తండ్రిపై ఆమెకు ప్రేమ లేదని .. ఆమెతో చెప్పుకుంటూ బాధపడేవాడు. కాగా, సదరు మహిళను సత్యనారాయణ తన ప్రియురాలిగా భావించేవాడు. ఆమె మాట్లాడే మాటలు అతనికి సాంత్వననిచ్చేవి. శనివారం రాత్రి మద్యం తాగిన మత్తులో ఇంటికి వచ్చిన సూర్యనారాయణ తన మనస్సులో ఉన్నదంతా దంపతుల ముందే చెప్పేశాడు. ‘మీ ఆవిడ అంటే నాకు ప్రాణం.. ఆవిడ నా గుండె. ఆమె లేకపోతే నేనుండలేను. నాకు మీ ఆవిడ కావాలి. అవిడ్ని నాకిచ్చెయ్..నాతో పంపించు.. జీవితాంతం సంతోషంగా ఉండేలా మీ అవిడ్ని నేను చూసుకుంటా’ అని ప్రియురాలి భర్తతో అన్నాడు. ‘నా పెళ్ళాన్ని ఇవ్వమని నన్నే అడుగుతావా’ అంటూ సదరు మహిళ భర్త అందుకు నిరాకరించాడు. ఆ రాత్రి ప్రియురాలి ఇంట్లోనే నిద్రించిన అతను తెల్లవారుజామున యూసుఫ్‌గూడ పోలీస్ బెటాలియన్ పెట్రోల్ బంకుకు వెళ్లి.. రూ .500 పెట్రోల్ ని కొనుగోలు చేసి.. పెట్రోల్ క్యానుతో ఇంటికి చేరాడు. ప్రియురాలి ఇంటి ముందు తన శరీరంపై క్యాన్ లోని పెట్రోల్ అంతా పోసుకుని నిప్పంటించుకున్నాడు. 90 శాతం కాలిన గాయాలతో గాంధీ దవాఖానాలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరగాళ్లా? బ్లాక్‌మెయిలర్లా?

తహసీల్దార్ కేసు విషయంపై సర్వత్రా చర్చ

సిటీబ్యూరో, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): సైబర్‌నేరగాళ్లు కొత్త ఎత్తులతో ప్రభుత్వ ఉద్యోగులను బురిడీ కొట్టిస్తున్నారు. అయితే సైబర్‌నేరగాళ్ల ముసుగులో ఏసీబీ పేరుతో తెలిసిన వాళ్లే అవినీతి ఆరోపణలు ఎదుర్కొనే ప్రభుత్వ ఉద్యోగులను బ్లాక్‌మెయిలింగ్‌లకు పాల్పడే అవకాశాలు సైతం ఉంటున్నాయనే చర్చ జరుగుతున్నది. యాదాద్రి జిల్లా, రాజాంపేట మండల తహసీల్దార్‌ను బ్లాక్‌మెయిల్ చేసిన సైబర్‌నేరగాళ్లు అతని కుటుంబ సభ్యుల నుంచి రూ. 3.3 లక్షలు కాజేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఏసీబీకి కూడా ప్రభుత్వ ఉద్యోగులను అప్రమత్తం చేస్తూ ఏసీబీ ఎప్పుడు కూడా ప్రభుత్వ ఉద్యోగులను కేసులు నమోదుచేస్తామంటూ ఎప్పుడు కూడా కేసులు నమోదు చేయదని అలాంటి కాల్స్‌ను నమ్మొద్దంటూ సూచనలు చేశారు. డిజిటల్ అరెస్టులలో సైబర్‌నేరగాళ్లు మొదటగా కస్టమ్స్, సీబీఐ, ఈడీ పేర్లతో పోలీసుల దుస్తులతో సైబర్‌నేరగాళ్లు మాట్లాడుతూ భయాందోళనలు కల్గిస్తుంటారు. దీనిపై ఇటీవల కేంద్ర ప్రభుత్వం విస్తృతంగా ప్రజలలో అవగాహన కల్పించేందుకు సెల్‌ఫోన్ కాల్ ట్యూనర్, టీవీలు, సోషల్‌మీడియాలలో ప్రకటనలు ఇస్తుంది. అయినా కూడా ఇలాంటి నేరాలు తగ్గుముఖం పట్టడం లేదు. కాగా,ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన అవినీతి గూర్చి బాగా తెలిసిన వాళ్లు ఏసీబీ పేరును ఉపయోగించే అవకాశాలున్నాయి. గతంలోను ఇలాంటి కేసులు నమోదయ్యాయి. ఏసీబీ, సీబీఐ నకిలీ అధికారులు కూడా అప్పుప్పుడు హల్ చేసే ఘటనల వెలుగులోకి వస్తుంటాయి. ఏసీబీ అధికారులు ఎవరు కూడా ఫోన్ చేయరనే విషయం ఆయా అధికారులకు తెలిసినా కొన్ని సందర్భంలో తప్పులో కాలేస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఆ జాబితాలో చేరుతుండడం ఆందోళన కల్గిస్తోంది.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 16 : తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తాండూరు మండల పరిధిలోని ఐనెల్లి (జినుగుర్తి) తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి 6 నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థినీ, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అనధికార కోతలు..

రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాండూరు రూరల్, ఫిబ్రవరి 16 : మండల పరిధిలో విద్యుత్ కోతలు ఆరంభమయ్యాయి. ఎలాంటి సమాచారం లేకుండా రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తుండడంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అనధికారికంగా రెండు గంటల పాటు కరెంట్ కోత విధించారు. తాండూరు మండల పరిధిలోని గౌతాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ కోత విధించారు. దీంతో గౌతాపూర్, గోపన్‌పల్లి, చెంగోల్, పర్వతాపూర్, చింతామణి పట్టణం, అల్లాపూర్ తదితర గ్రామాల్లోని ప్రజలు కరెంట్ కోత విధించడంపై వ్యాపారులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెప్పపాటు కరెంట్ పోదని ప్రభుత్వ ఉన్నతాధికారులు ఓ పక్క చెబుతున్నారు. అనధికారికంగా కరెంట్ కోతలు విధిస్తూ రైతులు, వ్యాపారులను ఉసూరుమనిపిస్తున్నారు. గౌతాపూర్, చెంగోల్, గోపన్‌పల్లి గ్రామ శివారులో పాలీషింగ్ పరిశ్రమలు ఉన్నాయి. కరెంట్ కోత విధించడంతో కార్మికులకు పనిలేకుండా పోయింది. రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. కోతలపై సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు.

రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతి

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 16: పట్టాలు దాటుతున్న రైల్వే ఉద్యోగుడిని గుర్తు తెలియని రైల్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. తార్నాకకు చెందిన గాజుల శ్రీధర్ (51) లాలాగూడ వర్క్ షాపులో విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో మౌలాలి–చర్లపల్లి స్టేషన్ల మధ్య శ్రీధర్ పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టగా మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహన్ని స్వాధీనం చేసుకొని గాంధీకి తరలించారు.

గంజాయి పట్టివేత

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 16, (నమస్తే తెలంగాణ): నగరంలోని చార్మినార్, సరూర్‌నగర్ ప్రాంతాల్లో ఎస్టీఎఫ్ఏ బృందం దాడులు జరిపి గంజాయిని స్వాధీనం చేసుకుంది. ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్టీఎఫ్ఏ టీం లీడర్ అంజిరెడ్డి వివరాల ప్రకారం.. గంజాయి సరఫరా చేస్తున్నారనే అనుమానంతో ఆదివారం చార్మినార్, సరూర్‌నగర్ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. చార్మినార్ పరిధిలో బెంగాల్‌కు చెందిన అజీమ్ అహ్మద్ ఖాన్ నుంచి 1.2 కిలోల గంజాయి, సరూర్ నగర్ ప్రాంతంలోని చైతన్యపురిలో పోతుకంటి అనిల్, మొగిలి సాయికుమార్‌ల నుంచి 340 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు, దానితో పాటు వారి వద్ద రెండు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్టీఎఫ్ఏ టీం లీడర్ అంజిరెడ్డి తెలిపారు.

రూ.4లక్షల డ్రగ్స్ స్వాధీనం

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 16, (నమస్తే తెలంగాణ): చదువుకోడానికి వచ్చి గంజాయి, అక్రమ మద్యం విక్రయిస్తున్న ఏపీకి చెందిన ముగ్గురు యువకులను చిలుకూరి నగర్‌లోని శ్రీనివాస టవర్స్ ప్రాంతంలో ఆదివారం ఎక్సైజ్ ఎన్ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ సుభాష్ చంద్ర తెలిపిన వివరాల ప్రకారం..‘ప్రకాశం జిల్లాకు చెందిన జగదీశ్‌రెడ్డి, కడపకు చెందిన అక్బర్ హుస్సేన్, కర్నూల్ జిల్లాకు చెందిన అజయ్ కుమార్ చదువుకునేందుకు హైదరాబాద్‌కు వచ్చారు. కానీ చదువు ముసుగులో గంజాయి, అక్రమ మద్యం విక్రయిస్తున్నారు. నిందితుల వద్ద 18 గ్రాముల ఎండీఎం డ్రగ్స్, 53 గ్రాముల ఓజి కుష్, 1.24కేజీల గంజాయి, అక్రమ మద్యం సీసాలు స్వాదీనం చేసుకున్నాం. వీటి విలువ రూ.4లక్షలు ఉంటుందని అంచనా’ అని తెలిపారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గంజాయి పట్టుకున్న వారిలో సీఐ సుభాష్ చంద్రతో పాటు ఎస్సై వెంకట్, కానిస్టబుల్ రవి, శ్రీను, శ్యామల ఉన్నారు.